నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఘట్‌కేసర్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ యశ్వంత్‌కుమార్ తెలిపారు. 11 కేవీ డయానో ఫీడర్ పరిధిలోని యంనంపేట్, ఘనాపూర్ పారిశ్రామికవాడలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ప్రకటించారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అరుంధతి ప్రకటించారు. ఈనెల 10 వరకు అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో సంప్రదించాలని కోరారు.

పిల్లలతో సహా తల్లి అదృశ్యం



ఘట్‌కేసర్: భర్తతో గొడవపడి ఇద్దరు పిల్లలతో ఓ తల్లి అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. బండి సుబ్బలక్ష్మి (34) దినసరి కూలీ. కాగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. బుధవారం ఉదయం కుమారుడు వికాస్ (12), కూమార్తెను తీసుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు బంధువులు, తెలిసిన చోట వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె సోదరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

ఘట్‌కేసర్: గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని ఘట్‌కేసర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గాంధీనగర్‌లో మంగళవారం సాయంత్రం పోలీసులు పెట్రోలింగ్ విధుల్లో ఉండగా.. ఓ యువకుడు బ్యాగుతో అనుమానాస్పదంగా కనిపించాడు. అతడు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా.. అతడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. విచారించగా షేక్ షాహిద్‌గా (25) తేలింది. గాంజా పీల్చే అలవాటుందని, ఇతరులకు విక్రయిస్తాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. గంజాయితో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

వాహనాల ఆకస్మిక తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఏసీపీ చక్రపాణి

పోచారం: నేరాలు జరగకుండా చర్యలు తీసుకోవడంలో భాగంగా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపూర్‌లో మల్కాజిగిరి డివిజన్ ఏసీపీ చక్రపాణి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజుతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కుస్తీ పోటీల్లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ



అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీలత, వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి

ఘట్‌కేసర్: కుస్తీ పోటీల్లో అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థినులు సత్తాచాటారు. ఆగస్టు 1, 2వ తేదీల్లో హైదరాబాద్ చంద్రాయణగుట్టలో జరిగిన 12వ అండర్ 23 తెలంగాణ రాష్ట్రస్థాయి ఓపెన్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్–25లో 6 పతకాలు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి విద్యార్థినులను అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్లు స్వప్న, డ్రిల్ ఆర్మీ ఇన్‌స్ట్రక్టర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘన నివాళి

ఘట్‌కేసర్: మలిదశ తెలంగాణ సిద్ధాంత రూపకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి, తెలంగాణ చిన్నమ్మ సుష్మాస్వరాజ్ వర్ధంతిని అవుషాపూర్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున్ ముదిరాజ్, రామోజీ, కృష్ణ, మహిపాల్‌రెడ్డి, సురేష్‌నాయక్, లక్ష్మారెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, సాయిలు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో నీటమునిగిన ఇళ్లు, వరదలో చిక్కుకున్న బస్తీవాసులు (ఫైల్)





ముంపు సమస్య తీరేనా ?

కార్పొరేషన్‌గా మారినా.. మారని పరిస్థితి

- ఏళ్లు గడిచినా సౌకర్యాలు కరువు
- వర్షం కురిస్తే కాలనీల్లో మోకాల్లోతు నీరు

జవహర్‌నగర్: వర్షం పడితే చాలు కార్పొరేషన్‌లోని కాలనీలు బురదమయంగా మారుతున్నాయి. ముంపు ప్రాంతాల్లోని ప్రజలు వర్షం కురిసిన ప్రతిసారి బిక్కుబిక్కుమంటూ భయాందోళన చెందుతున్నారు. పలువురు ఇళ్లను ఖాళీ చేసి మరోచోట తలదాచుకునే పరిస్థితి ఏర్పడుతోంది.

కనిపించని పురోగతి

గడిచిన ఐదేళ్లుగా ముంపు ప్రాంతాల్లో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని పాలకులు, అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం అనుకున్నంత వేగంగా పనులు కొనసాగడం లేదు. జవహర్‌నగర్ ముంపు ప్రాంతాలకు ప్రమాదం పొంచి ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. గతేడాది జవహర్‌నగర్ పరిధిలోని సుక్కమ్మకుంట, కేసీఆర్‌నగర్, పాపయ్యనగర్, ఎన్టీఆర్ నగర్, కేసీఆర్ నగర్ ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. అవే వర్షాలు మళ్లీ కురిస్తే ఈసారి కూడా ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. దీనిపై సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

20 కాలనీలు జలమయం..

కార్పొరేషన్‌లో దాదాపు 50 వేల ఇళ్లు ఉండగా.. 2 లక్షల జనాభా నివసిస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలోని 2,3,7, 8,19,20 డివిజన్‌లలో ఎక్కువగా ఉంటోంది. సుక్కమ్మకుంట, పాపయ్యనగర్, సంతోష్‌నగర్ ఈస్ట్, కేసీఆర్‌నగర్, ఎన్టీఆర్‌నగర్, అంబేడ్కర్‌నగర్, ఆనంద్‌నగర్ తదితర ప్రాంతాలు ఉన్నాయి. సుమారు 20 కాలనీలు ప్రతిసారి ముంపునకు గురవుతున్నాయి. ఈ ప్రాంతంలో దాదాపు 40 వేల మంది జనాభా ఇబ్బంది పడుతున్నారు.

- చిన్నపాటి వర్షం పడినా ఎగువ ప్రాంతమైన బాలాజీనగర్ నుంచి సుక్కమ్మ బస్తీ, కాప్రా సరిహద్దు, ఆర్మీ డెంటల్ కళాశాల నుంచి వచ్చే నీరు కేసీఆర్‌నగర్, అంబేడ్కర్‌నగర్ మీదుగా దమ్మాయిగూడ చెరువులో కలుస్తుంటాయి.
- పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు, రోడ్లు ఆక్రమణకు గురికావడంతో బయటకు వెళ్లకుండా ఉన్నాయి.
- గతేడాది పలు ఇళ్లలోకి చేరిన నీరు బయటకు తీయడానికి జిల్లా అధికారులతో పాటు ప్రత్యేక బృందాలు పనిచేయాల్సి వచ్చింది.
- ఇప్పటికీ చాలా కాలనీల్లో చెత్త,చెదారం రాళ్లురప్పలతో నిండి ఉండటం గమనార్హం.

ఇలా పరిష్కరిద్దాం...

జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు నలు వైపులా పూర్తిస్థాయిలో ఔట్‌లైన్ ఏర్పాటు చేయాలి. కాలనీల నుంచి వస్తున్న నాలా నీరు ఔట్‌లైన్‌కు అనుసంధానం చేసి వరదనీటిని ఎప్పటికప్పుడు నాలాల్లో ప్రవహించేలా తగిన చర్యలు తీసుకోవాలి. రోడ్డుకు అడ్డంగా ఉన్నా అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించేలా అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

ముంపు సమస్యను పరిష్కరించండి



వర్షం పడిన ప్రతిసారి నరకయాతన పడాల్సి వస్తోంది. రోడ్లు, కాల్వలు లేక తీవ్రఇబ్బందులు పడుతున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణం చర్యలు తీసుకుని తమ కాలనీల్లో పర్యటించి సమస్యలపై దృష్టి సారించాలి.

– యాకయ్య, పాపయ్యకాలనీ

నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు



గత పాలనలో కాల్వలను తీయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇది ప్రజాప్రభుత్వం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటాం.ప్రత్యేక నిధులతో ఓపెన్ డ్రెయిన్ నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

– శ్రీకాంత్‌యాదవ్, కాంగ్రెస్ నేత

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం



కార్పొరేషన్ పరిధిలో వర్షాకాలానికి అనుగుణంగా పనులు చేపడుతున్నాం. ప్రస్తుతం కాల్వల్లో ఎలాంటి వ్యర్థాలు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ కోసం దాదాపు రూ.87 కోట్ల నిధులకు ప్రతిపాదనలు చేశాం. నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం.

– వసంత, జవహర్‌నగర్ కమిషనర్

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

మాజీ ఎంపీ సీతారాంనాయక్



ఘట్‌కేసర్: రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని, బీసీల పేరుతో ఇతర మతస్తులకు రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తుందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ సీతారాంనాయక్ ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ తీరుపై మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన అవుషాపూర్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్ ధర్నా కాంగ్రెస్ ఆడుతున్న డ్రామా అని విమర్శించారు. బీజేపీ అనూహ్యంగా పుంజుకుంటుందని, ఈటల లాంటి బీజేపీ నేతలను టార్గెట్ చేసి ప్రజల దృష్టి మరల్చాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్నారు. మాజీ ఎంపీపీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలు అమలు చేయని విషయం ప్రజలకు తెలియకుండా ఉండాలని, బీసీ నాయకుడు ఈటలపై ఈ అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం చేసిన మచ్చలేని నాయకుడిపై నిందలు వేయడం సరికాదన్నారు. మాజీ కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్‌ముదిరాజ్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, కృష్ణ, సురేష్‌నాయక్, లక్ష్మారెడ్డి, మశ్చేందర్‌రెడ్డి సాయిలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ సీఐఎస్ఎఫ్ అధికారి మృతి

కుషాయిగూడ: రోడ్డు ప్రమాదంలో సీఐఎస్ఎఫ్ రిటైర్డ్ ఏఎస్సై గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన బుధవారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగారంలో నివసిస్తున్న శంకర్ (60) సీఐఎస్ఎఫ్ ఏఎస్ఐగా చర్లపల్లి మింట్‌లో విధులు నిర్వహించి రిటైర్డ్ అయ్యారు. సోలాపూర్‌కు చెందిన శంకర్ విధి నిర్వహణలో భాగంగా ఇక్కడ స్థిరపడ్డాడు. తన రిటైర్డ్‌మెంట్ అనంతరం చెంగిచర్లలో ఓ స్వీట్ షాప్‌ను ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో రోజులానే మంగళవారం షాపుకు వెళ్లి రాత్రి తన ద్విచక్రవాహనంపై తిరిగి వస్తున్న క్రమంలో చిన్న చర్లపల్లి సిల్వర్‌వోక్ బంగ్లాస్ వద్ద ఎదురుగా అతివేగంగా దూసుకొచ్చిన కారు అతడిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శంకర్‌ను స్థానికులు 108 సాయంతో ఈసీఐఎల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్‌కు జిల్లా నాయకుల రాజీనామా

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్, బీఆర్ఎస్ రైతు సంఘం మండల అధ్యక్షుడు ధర్మారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ వ్యక్తిగత కారణాలతో బీఆర్ఎస్ పార్టీ, ప్రాథమిక సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేశారు. ఇకపై సామాజిక కార్యకర్తగా ప్రజల కష్టసుఖాల్లో పాల్గొంటానని ధర్మారెడ్డి చెప్పగా.. వాలీబాల్ కోచ్‌గా సేవలందిస్తానని శ్రీనివాస్ అన్నారు. ఇన్నాళ్లు సహకరించిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్లాట్‌కు ఇంటి పన్ను !

ఘట్‌కేసర్: ఓపెన్ ప్లాట్‌కు ట్యాక్స్ వేస్తున్నారని, కూల్చిన ఇంటి రికార్డు మార్చాలని దరఖాస్తు చేసుకున్న పట్టించుకోవడం లేదని ప్లాటు యజమాని అశోక్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఇల్లు ఉండగా పూర్తి టాక్స్ చెల్లించానని, ఇంటిని కూల్చివేసి 2023లో ప్లాటుగా విక్రయించిన తర్వాత కూడా 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ. 15,946లు చెల్లించాలని ఆన్‌లైన్‌లో బిల్లు వేస్తున్నారన్నారు. ఇంటి ట్యాక్స్‌ను రిక్దారు నుంచి తొలగించాలని సిబ్బందిని కోరితే మున్సిపల్ కమిషనర్‌ను కలవాలని సూచిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు.

సామర్థ్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలి

జిల్లా కలెక్టర్ మను చౌదరి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనూ చౌదరి

శామీర్‌పేట్: విద్యార్థుల సామర్థాలను ఉపాధ్యాయులు గుర్తించి, అందుకు అనుగుణంగా ప్రోత్సహించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. బుధవారం మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జగ్గంగూడలోని తెలంగాణ మైనార్టీ గురుకుల రెసిడెన్షియల్ స్కూల్, బాయ్స్ జూనియర్ కళాశాల వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎలాంటి ఒత్తిడి లేకుండా చదవాలని, వెనుకంజలో ఉన్న సబ్జెక్ట్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని, మానసిక ఒత్తిడికి గురికాకూడదని సూచించారు. ఆహార నాణ్యతతో పాటు మెనూ ప్రకారం అల్పాహారం, స్నాక్స్ అందిస్తున్నారా.. అని ఆరా తీశారు. అనంతరం వంటశాల, స్టోర్ రూమ్‌లను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఆహార నాణ్యతలో లోపాలుంటే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. మూడుచింతలపల్లి తహసీల్దార్ వెంకటనరసింహారెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను పరిష్కరించాలి



శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

శామీర్‌పేట్: భూభారతి, రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కార దిశలో భాగంగా శామీర్‌పేట్ తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. భూభారతి ఆన్‌లైన్ ద్వారా రెవెన్యూ సదస్సులో అందిన దరఖాస్తులను ఎంత వరకు పరిష్కారమయ్యాయని శామీర్‌పేట్ తహసీల్దార్ యాదగిరిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిష్కారానికి అవుతున్న జాప్యానికి గల కారణాలను పరిశీలించారు. సాంకేతికపరమైన ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌తో పాటు మ్యానువల్‌గా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అదనపు కలెక్టర్ పరిశీలించారు.

బాలికల హాస్టల్ సందర్శన



బాలికల హాస్టల్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలోని బాలికల వసతి గృహాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా సందర్శించారు. జెడ్పీ సీఈఓ కాంతమ్మ, ఎస్సీ వెల్ఫేర్ అధికారి వినోద్‌కుమార్‌తో కలిసి బాలికల హాస్టల్‌ను పరిశీలించారు. హాస్టల్ భవనం విద్యార్థినులకు అనుకూలంగా లేనందున భవనం స్థితిగతులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరో చోటుకు హాస్టల్‌ను మార్చేందుకు అనువుగా ఉన్న జిల్లా పరిషత్ భవనం, ఎంపీడీవో భవనాల్లో ఉన్న వసతులు, సదుపాయాలను ఆమె పరిశీలించారు. ఈ రెండు భవనాల్లో అన్ని మౌలిక వసతులు కలిగి ఉన్న ఏదైనా ఒక భవనంలోకి హాస్టల్ మార్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

కమనీయం.. నీలకంఠస్వామి కల్యాణం



కల్యాణ వేడుకలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని కొర్రెముల్ మహంకాళి సహిత బ్రహ్మసూత్ర నీలకంఠస్వామి దేవాలయ తృతీయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం మహంకాళి, నీలకంఠస్వామి కల్యాణం వేడుకగా జరిగింది. ఉదయం పూర్ణాహుతి, శివపార్వతుల మంగళ స్నానాలు నిర్వహించారు. స్వామివారితో పాటు అమ్మవారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ మండపంపై అలంకరించి పట్టువస్త్రాలు సమర్పించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ జెడ్పీటీసీ మంద సంజీవ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ ఓరుగంటి కవితావెంకటేశ్, మాజీ ఉప సర్పంచ్ రాజు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు బొడ్డు వినోద నాగార్జున్, మాజీ సర్పంచ్ వంగూరి శివశంకర్, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త రవిగౌడ్ తదితరులున్నారు.



తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

స్వచ్ఛతపై అవగాహన

కీసర: 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బుధవారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో తడి, పొడి చెత్త వ్యర్థాలు వేరుచేయడంపై అవగాహన కల్పించారు. అదే విధంగా సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన, గృహ కంపోస్టింగ్ అవగాహన, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అవగాహన కల్పించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు పంపిణీ చేశారు. కమిషనర్ వెంకట్‌రెడ్డి, డీఈఈ బాలమురళి, మేనేజర్ వెంకటేశం, పంచాయితీ సెక్రటరీ నారాయణగౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ సిద్ధాంతకర్తకు ఘన నివాళి

ఘనంగా ప్రొ. జయశంకర్ జయంతి వేడుకలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జయశంకర్ సార్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. ప్రతి ఉద్యోగి, పౌరుడు ఆయనను స్ఫూర్తిగా తీసుకొని పనిచేస్తే అదే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో లాఆఫీసర్ చంద్రావతి, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఝాన్సీరాణి, ఏఓ రామ్మోహన్, అధికారులు, ఉద్యోగులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా మేడ్చల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ప్రొ. జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు, సంఘాలు, సంస్థల ప్రతినిధులు ప్రొ. జయశంకర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.



నాగారం మున్సిపల్ కార్యాలయంలో...



నాగారం జిల్లా పరిషత్ పాఠశాలలో..



మేడ్చల్ పట్టణంలో..



కీసర తహసీల్దార్ కార్యాలయంలో..



విశ్వకర్మ ఐక్య సంఘం ఆధ్వర్యంలో...



గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయంలో...



మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో..